క్లుప్తంగా

ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

చెన్నూర్: సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు వెళ్లిన మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్మికులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకురాలు కరీమా, సమ్మక్క, భూదక్క, ఉమారాణి, దుర్గక్క, మదునక్క, కార్మికులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం..!

మంచిర్యాలక్రైం: పాత మంచిర్యాలలోని ఇండియా–1 ఓ ప్రైవేట్ ఏటీఎంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించినట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక సీఐ బన్సిలాల్‌ను వివరణ కోరగా చోరీకి యత్నించిందనేది అవాస్తవం. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మద్యం మత్తులో ఏటీఎం అద్దం పగలగొట్టినట్లు తెలుస్తోందని, ఏటీఎంలో చోరీ జరగలేదని, ఈ విషయంలో ఎవరి నుంచి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

'దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి'

నస్పూర్: గోదావరిఖని ఏరియాలో ఓ మహిళా కార్మికురాలిపై ఇటీవల దాడి చేసిన ఏఐటీయూసీ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య, బ్రాంచి కార్యదర్శి అనిల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధితురాలు ఐఎన్‌టీయూసీ కార్యకర్త అయినా, ఐఎన్‌టీయూసీ నాయకులు దాడిని ఖండించి ఆమెకు బాసటగా నిలివకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ రెండు సంఘాలు మహిళా ఉద్యోగులను చిన్న చూపు చూస్తున్నాయని ఆరోపించారు. నిందితులను అరెస్ట్ చేసి మహిళా ఉద్యోగికి న్యాయం చేయకపోతే రాబోవు రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో, తదితరులు

భీమారం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో చేపట్టిన పారిశుధ్య పనులను గురువారం ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, మెడికల్ ఆఫీసర్ అనీల్‌కుమార్ పరిశీలించారు. దోమల వ్యాప్తి ఎక్కువగా ఉన్నందునా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్‌తో పాటు దోమల మందు పిచికారీ చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డుల పర్యటన

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం నుంచి సీపీఎం ఆధ్వర్యంలో వార్డుల పర్యటన నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొడెంకి చందు అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో సీపీఎం నాయకురాళ్లు సిడాం సమ్మక్క, సామల ఉమారాణి, రాతిపల్లి నగేశ్, కుమ్మరి ఎల్లమ్మ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే వెంటనే ఎస్సీ డిక్లరేషన్‌ను ప్రకటిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పాలన పగ్గాలు చేత బట్టాక ఆ విషయాన్ని మర్చిపోయారని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్ విమర్శించారు. ఎస్సీ డిక్లరేషన్‌ను ప్రకటించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీఎం ఎస్సీ డిక్లరేషన్‌ను ఆలస్యం చేయకుండా సత్వరంగా ప్రకటించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు ఎం.మొగిలి, రాజన్న, వెంకన్న, నరేందర్, రాజు, విజయ్, చంద్రయ్య, నరేష్ పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలు..!

- అంతిమ సంస్కారాల కోసం అష్టకష్టాలు
- రైల్వే పట్టాలు దాటి వెళ్తూ ఇబ్బందులు
- శ్మశానవాటిక కోసం స్థలం కేటాయింపునకు నోచని వైనం
- అన్ని మతాల ప్రజలదీ ఇదే పరిస్థితి..
- సింగరేణి ఆధీనంలో స్థలాలుండటంతో కుంటుపడుతున్న అభివృద్ధి
- సీఎండీ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



అంత్యక్రియల కోసం రైల్వే పట్టాలు దాటుతున్న బాధిత కుటుంబ సభ్యులు (ఫైల్)

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణ ప్రజల బాధలు వర్ణనాతీతంగా మారాయి. కాలం చేసిన మనిషి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఏ మతానికి అంటూ ప్రత్యేక శ్మశానవాటికలు లేకపోవటమే ఇందుకు మూలం. కన్నీటి వీడ్కోలు పలికే ఆఖరి మజిలీ సందర్భంగా బంధువులు.. చాలా మానసిక వేదనకు గురికావాల్సిన పరిస్థితి. ఇంతటి దయనీయస్థితి ఎక్కడైనా ఉందో లేదో గాని రామకృష్ణాపూర్ పట్టణ వాసులు మాత్రం ఈ అనుభవాన్ని చవిచూస్తున్నారని తెలుస్తోంది. ఇటీవలే ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సింగరేణి సీఎండీని కలిసిన నేపథ్యంలో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉంటూ వస్తున్న ఈ సమస్యకు పరిష్కారమార్గం



ఆర్‌కేపీలో శ్మశానవాటిక కోసం తాత్కాలికంగా వినియోగిస్తున్న స్థలం

పడుతుందేమోననే ఆశలు పట్టణ ప్రజల్లో చిగురిస్తున్నాయి.

– రామకృష్ణాపూర్ పట్టణ ప్రజలను కొన్ని దశాబ్దాల కాలం నుంచి శ్మశానవాటిక సమస్య పీడిస్తోంది. వేల జనాభా ఉన్నా.. అధికారిక శ్మశానవాటికలంటూ ఏవీ లేవు. అప్పటికప్పుడు ఎక్కడో చోట అంత్యక్రియలు నిర్వహిస్తూ వస్తున్నారు. రవీంద్రఖని రైల్వేస్టేషన్ సమీపంలో కొన్నాళ్లక్రితం నాటి సమాధుల స్థలం ఉన్నా, అప్పట్లో అది వివాదాస్పదంగా మారిన సంగతి తెల్సిందే. రైల్ ట్రాక్ దాటి అటవీశాఖ స్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారని, అటువైపు రాకుండా అటవీ అధికారులు ఏకంగా ప్రహరీ నిర్మించారు. పిమ్మట కొంతమేరకు గోడను తొలగించి ఓ మతం వారు అంత్యక్రియలకు ఆ స్థలం వాడుకుంటున్నా, రైల్వే పట్టాలు దాటి వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అనివార్య పరిస్థితుల్లో అనధికారికంగా ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌పీ, ఆర్‌కే1ఏ గని సమీపంలో అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. కనుకనే అధికారిక శ్మశానవాటికల కోసం పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీఎండీని కలిసిన ఎమ్మెల్యే...

రామకృష్ణాపూర్ పట్టణ అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టి సారించారు. ఇటీవలే సింగరేణి సీఎండీ బలరాం నాయక్‌ను ఎమ్మెల్యే కలిసి వచ్చారు. సంస్థ అధీనంలో స్థలాలు ఉండటంతో కొంత వెసులుబాటు కల్పించి అభివృద్ధి పనుల కోసం స్థలాలు కేటాయించాలని కోరారు. ఆర్‌కేపీ స్టోర్స్ సమీపంలో ఖాళీ స్థలం ఉన్నందునా, ఆ స్థలాన్ని శ్మశానవాటిక, డంపింగ్ యార్డు కోసం కేటాయించాలని ప్రతిపాదించారు. పట్టణ ప్రజలు సైతం ఇదే స్థలం అనుకూలంగా ఉంటుందని అభిప్రాయపడుతుండటంతో ఎమ్మెల్యే కూడా సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు శ్మశానవాటిక ఏర్పాటుకు సహకరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే శ్మశానవాటిక ఏర్పాటు

రామకృష్ణాపూర్ పట్టణంలో ఉన్న స్థలాలన్నీ కూడా దాదాపుగా సింగరేణి పరిధిలోనే ఉన్నాయి. ఇక్కడ శ్మశానవాటిక కోసం సింగరేణి స్థలం కేటాయించాలని అధికారులను కోరాం. సంస్థ సీఎండీని స్థానిక ఎమ్మెల్యే వివేక్ కలిసి ఇటీవలే సమస్యను విన్నవించారు. తమతో పాటు సింగరేణి అధికారులు కూడా స్టోర్స్ సమీపంలోని స్థలాన్ని సంయుక్తంగా పరిశీలించాం. స్థలం కేటాయిస్తే అతి త్వరలోనే శ్మశానవాటిక ఏర్పాటు అవుతుంది.

– మురళీకృష్ణ, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



పాల్గొన్న జీఎం మనోహర్, అధికారులు

నస్పూర్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తిని సాధిస్తున్నామని ఎన్విరాన్మెంట్ జీఎం ఏ మనోహర్ అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో బెల్లంపల్లి రీజియన్ భూగర్భ, ఉపరితల గనుల పర్యావరణ అనుమతులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థలో బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు తగిన ప్రణాళికలతో ముందుకెళ్లాలని సూచించారు. ఎస్సార్పీ ఉపరితల గనిపై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్, ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం మురళీధర్, ఇందారం పీవో ఏవీ రెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రామదాసు, అధికారులు చంద్రశేఖర్, ఆనంద్‌కుమార్, రవీందర్, హనుమాన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

బెల్లంపల్లి: రైతుల పంట రుణాలు మాఫీ చేయడాన్ని స్వాగతిస్తూ గురువారం ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే చిన్నయ్యకు కానీ, ప్రజల మానప్రాణాలతో చెలగాటమాడిన బీఆర్‌ఎస్‌కు గానీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆరిజిన్ డెయిరీ సీఈవో ఆదినారాయణ, సీఏవో బోడపాటి శేజల్, ప్రియదర్శిణి , సుధాకర్, హరి తదితరులు పాల్గొన్నారు.



జన్నారం: రాస్తారోకో చేస్తున్న నాయకులు



భీమారంలో బ్యాంకు ఎదుట రాస్తారోకో



కన్నెపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

'రుణమాఫీ'పై రగడ..!

- ఆంక్షలు లేకుండా వర్తింపజేయాలని బీఆర్‌ఎస్ డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి రాస్తారోకో, ధర్నాలు
- తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేత



నెన్నెల తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం ఇస్తూ..



తాండూర్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ...



కాసిపేట: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి



వేమనపల్లి: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

జన్నారం/భీమారం/భీమిని/నెన్నెల/తాండూర్/కాసిపేట/వేమనపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బేషరతుగా ఆంక్షలు లేకుండా అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని, ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులపై రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు మెలికలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి శరతులు లేకుండా రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. జన్నారంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించగా, అరగంట తర్వాత పోలీసులు అక్కడకి చేరుకొని రాస్తారోకోను విరమింపజేశారు. భీమారంలో రాస్తారోకో నిర్వహించి అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నెన్నెల ధర్నా అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ రమేష్‌కు అందజేశారు. భీమిని, కన్నెపల్లి మండల కేంద్రాల్లో ధర్నా చేపట్టి అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. తాండూర్‌లో రాస్తారోకో నిర్వహించిన అనంతరం తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కాసిపేటలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో డెప్యూటీ తహసీల్దార్ మానిక్‌రావుకు వినతిపత్రం ఇచ్చి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వేమనపల్లిలో నిరసన చేపట్టి అనంతరం డెప్యూటీ తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా చోట్ల జన్నారంలో మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయధర్మా, భీమారంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, భీమినిలో మాజీ జెడ్పీటీసీ కొటారపు సత్యనారాయణ, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, తాండూర్‌లో మండల అధ్యక్షుడు సుబ్బదత్తుమూర్తి, మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, వేమనపల్లిలో పీఏసీ ఎస్ చైర్మన్ వెంకటేషం, మాజీ జెడ్పీటీసీ భీమ య్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ లోన్ ఇప్పిస్తానని మోసం..!

- న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు



మోసం చేశారని వాపోతున్న బాధితుడు శంకర్

దండేపల్లి: బ్యాంక్ లోన్ విషయంలో మధ్యవర్తిని నమ్ముకున్న ఓ యువకుడు, చివరకు మోసపోయాడు. ఆ విషయాన్ని యువకుడు ఆలస్యంగా తెలుసుకొని, న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించాడు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. దండేపల్లి మండలం మాదాపూర్‌కు చెందిన ఆవునూరి శంకర్ సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. తాను చేసే పనిమీద రూ.12లక్షల బ్యాంక్ లోన్ ఇప్పిస్తానని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శంకర్‌ను నమ్మించాడు. అతడి మాటలు నమ్మి, అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను మధ్యవర్తికి అప్పగించాడు. దీంతో లోన్ ప్రాసెస్‌లో భాగంగా, తాను తీసుకున్న లోన్ ద్వారా సెంట్రింగ్ సామగ్రికి సంబంధించి, ఓ షాపు ద్వారా కొటేషన్ వేయించాడు. దీంతో గత మార్చి నెలలో శంకర్‌కు లోన్ మంజూరయ్యింది. కానీ అతడి చేతికి డబ్బులు రాలేదు. పైగా కొటేషన్ వేసి ఇచ్చిన షాపుకు వెళ్లి సామగ్రి అడిగితే డబ్బులు రాలేదని చెప్పారు. దీంతో కంగుతిన్న ఆ యువకుడు బ్యాంక్‌కు వెళ్లి తనిఖీ చేసుకోగా, తాను ఇచ్చిన కొటేషన్‌లో కొటేషన్ జీఎస్టీ అకౌంట్‌కు బదులు.. వేరే అకౌంట్ నంబర్‌కు డబ్బులు బదిలీ చేసుకున్నారు. పైగా బ్యాంక్ అధికారులు లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించాలని చెబితే రెండు ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులు మధ్యవర్తి, శంకర్‌కు ఇచ్చి కట్టించాడు. ఇదేంటి నాకు లోన్ మంజూరు కాలేదు. నా చేతా ఇన్‌స్టాల్‌మెంట్ ఎందుకు చెల్లిస్తున్నారని అడిగితే, సమాధానం దాటవేశాడు. దీంతో మళ్లీ లోన్ చెల్లించకపోవడంతో బ్యాంక్ వాళ్లు శంకర్‌కు నోటీస్ జారీ చేశారు. అసలు నాకు లోన్ మంజూరైన విషయం నాకు తెలియదు., నాకు సామగ్రి ఇవ్వలేదు. పైగా డబ్బులు ఇవ్వలేదు. లోన్ విషయంలో మోసం జరిగిందని తెలుసుకున్న శంకర్ దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

'నాయీబ్రాహ్మణ మహిళా ఉద్యోగికి అవమానం'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఓ నాయీబ్రాహ్మణ మహిళా ఉద్యోగికి జరిగిన అవమానం ఆలస్యంగా వెలుగు చూడటంతో నాయీబ్రాహ్మణ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు మందపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, మాజీ ఎంపీపీ స్వర్ణలత ఈ ఘటనపై గురువారం తమ కులంపై వివక్ష చూపితే ఖచ్చితంగా ప్రతిఘటిస్తామని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. మంథని సివిల్ ఆస్పత్రిలో విష్ణుభక్తుల పూర్ణిమను ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రాజశేఖర్ తన బూట్లకు అంటిన మట్టిని తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించి, బూట్లను శుభ్రం చేయించుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే ఆ మహిళా ఉద్యోగికి క్షమాపణ చెప్పాలని, అతడిని వెంటనే సస్పెండ్ చేయాలని స్పష్టం చేస్తున్నట్లు తెలిపారు.

నాణ్యతకు మారుపేరు 'భారతి సిమెంట్'

చెన్నూర్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న 'భారతి సిమెంట్' అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసినట్లు ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాగర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ఏజెన్సీస్ షాపులో గురువారం తాపీమేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఇంజినీర్ మాట్లాడుతూ.. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే, భారతి అల్ట్రాఫాస్ట్ నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిల నిర్మాణానికి 'భారతి సిమెంట్' సరైన ఎంపిక అని పేర్కొన్నారు. భారతి సిమెంట్ ఇతర సిమెంట్లతో పోల్చుకుంటే మూడు రెట్లు మెరుగైందన్నారు. 'భారతి సిమెంట్' వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన 'భారతి సిమెంట్' ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహకరిస్తారని తెలిపారు. అనంతరం 50మంది తాపీమేస్త్రీలకు రూ.లక్ష ఉచిత బీమాబాండ్లను అందజేశారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ సంస్థ సిబ్బంది రాజేశ్, సురేశ్‌రెడ్డి, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.



బీమాబాండ్లు అందజేస్తున్న సంస్థ ఇంజినీర్

సఖీ సెంటర్ సందర్శన



మంచిర్యాలక్రైం: మెడికల్ కళాశాల విద్యార్థులు గురువారం సఖీ సెంటర్‌ను సందర్శించారు. సఖీ సెంటర్ ద్వారా మహిళలకు అందిస్తున్న సేవలపై సఖీ సెంటర్ నిర్వాహకులు వారికి అవగాహన కల్పించారు. మహిళల చట్టాలపై వివరించారు. ఏవైనా సమస్యలు ఎదుర్కొనే వారు 100, 181, 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. సఖీసెంటర్ నిర్వాహకురాలు శ్రీలత, మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



దేవునిగూడలో మొక్క నాటుతున్న ఎంపీడీవో

చెన్నూర్‌రూరల్: మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొమ్మెర గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గురువారం 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద' అనే కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కాశేశ్వరం తిరుపతిగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

జన్నారం: విరివిగా మొక్కలు నాటి పర్యవరణాన్ని పరిరక్షించుకుందామని ఎంపీడీవో శశికళ పేర్కొన్నారు. 'నాటుదాం ఒక చెట్టు అమ్మపేరు మీద' అనే కార్యక్రమంలో భాగంగా దేవునిగూడ, కవ్వాల్, పొనకల్ గ్రామ పంచాయతీల్లో గ్రామస్తులతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

చెన్నూర్ ఏడీఏగా బానోత్ ప్రసాద్



చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయ సహాయ సంచాలకులుగా బానోత్ ప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. చెన్నూర్‌లో మందమర్రి ఏడీఏ రాజేశం ఇన్‌చార్జి ఏడీగా విధులు నిర్వర్తించారు. ఆదిలాబాద్ ఏడీఏగా విధులు నిర్వర్తించిన బానోత్‌ప్రసాద్ చెన్నూర్‌కు బదిలీపై వచ్చారు. ఏడీఏగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్‌ను ఏఈవోలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

వైద్య శిబిరాలకు స్పందన

మంచిర్యాలక్రైం/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/భీమారం: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌లోని కమ్యూనిటీ భవన్‌లో జ్యోతి వికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో పీవీఆర్ఐ హైదరాబాద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్య పరీక్షలతో పాటు, మందులు పంపిణీ చేశారు. ముల్కల్లలో లయన్స్ క్లబ్ మంచిర్యాల, ల యన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య పరీక్షా శిబిరం గురువారం ముగిసింది. రెండు రోజుల్లో మొత్తం 200మంది వరకు కంటి పరీక్షలు జరపగా 40మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. భీమారంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చే శారు.

డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

నస్పూర్: నేటి సమాజంలో గంజాయి, డ్రగ్స్ అత్యంత ప్రమాదకరమైనవని డ్రగ్స్ నిర్మూలనకు తమవంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీసీసీ నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్ అన్నారు. పట్టణ పరిధిలోని పలు పాఠశాలల్లో సీసీసీ నస్పూర్ పోలీసుల ఆధ్వర్యంలో మానవ జీవితం, ఆరోగ్యం, సమాజంపై డ్రగ్స్, గంజాయి ప్రభావం అనే అంశాలపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పోలంపల్లిలో కొత్త ఓటర్ల నమోదు

భీమారం: మండలంలోని పోలంపల్లిలో గురువారం కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నేటి నుంచి ఎన్నికల సంఘం చేపట్టింది. ఈ మేరకు పోలంపల్లిలో బీఎల్‌వో నక్క రాజన్న కొత్తగా ఓటరు కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు.

మానవత్వం చాటుకున్నారు

జన్నారం: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన నిరుపేద యువతి వివాహానికి పలువురు దాతలు ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ధర్మారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం గుమ్ముల నర్సయ్య కుమార్తె గంగజమున వివాహం కోసం బీజేపీ అధ్యక్షుడు మధుసూధన్‌రావు రూ.5000, తెలంగాణ నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్‌నేత రూ. 5వేలు, కంప సుధీర్‌కుమార్ రూ.1000తో పాటుగా బట్టలు ఇచ్చారు. చేయి, చేయి కలిపి పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సహకరించి మానవత్వం చాటుకున్నారు.

బాధ్యతలు స్వీకరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల వ్యవసాయాధికారి(ఏఓ)గా డి.కృష్ణ నియామకం కాగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల ఏవోగా పని చేసిన కృష్ణ హాజీపూర్‌కు బదిలీపై రాగా, ఇక్కడ ఏఓగా పనిచేసిన రజిత ఏడీఏకు పీఏగా బదిలీ అయ్యారు.

నియామకం

చెన్నూర్: చెన్నూర్ పట్టణ అధ్యక్షుడిగా పిట్టల రవీందర్, మండల అధ్యక్షుడిగా నరిశెట్టి రాకేశ్‌ను జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆదేశాల మేరకు నియమించినట్లు బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జేక సంజీవ్ తెలిపారు.